నేడు 'విశాఖ-బ్రహ్మపూర్' రద్దు

తాటిచెట్లపాలెం : ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం-బ్రహ్మపూర్ (18526) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6,7వ తేదీల్లోను, బ్రహ్మపూర్-విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7, 8వ తేదీల్లో రద్దయినట్లు పేర్కొన్నారు.

విశాఖపట్నం-పలాస గమ్యం కుదింపు

విశాఖపట్నం-పలాస(67289) పాసింజర్ ఈ నెల 9 నుంచి 16వ తేదీ వరకు(శుక్ర, ఆదివారం తప్ప) శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో పలాసలో బయల్దేరాల్సిన పలాస-విశాఖపట్నం(67290) పాసింజర్ ఈ నెల 9వ తేదీ నుంచి 16వ తేదీ వరకు (శుక్ర, ఆదివారం తప్ప) పలాస నుంచి కాకుండా శ్రీకాకుళం నుంచి బయల్దేరుతుంది.

పారిశుధ్యంపై జెడ్సీ ఆరా



గెడ్డలో పూడిక పరిశీలిస్తున్న జెడ్సీ రాము

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని కాలనీ ల్లో పారిశుధ్యంపై జోన్ - 5 జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము ఆరా తీశారు. ఈ మేరకు ఆయన మురళీనగర్‌లోని వివిధ సెక్టార్లలో బుధ వారం పర్యటించారు. ఇంటింటికీ పారిశుధ్య సిబ్బంది వెళ్లి చెత్త సేకరిస్తున్న విధానాన్ని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. తడి, పొడి చెత్త సేకరణలో పాటించాల్సిన విధానాలను సిబ్బందికి ఆయన వివరించారు. మురళీనగర్ లో గెడ్డ పూడిక పనులు పరిశీలించారు. గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించి బ్లీచింగ్ చల్లాలని సిబ్బందిని ఆదేశించారు.

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు జలాభిషేకం చేశారు. ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సాయంత్రం కూడా అమ్మవారికి జలాభిషేకం చేశారు. సాయంత్రం అమ్మవారిని నూతన చీర, పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ వర్గాలు భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.



సత్యం జంక్షన్‌లో రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనచోదకులు

డేంజర్ జంక్షన్

సత్యం కూడలిలో ప్రమాదకరంగా రాకపోకలు

యథేచ్ఛగా రాంగ్‌రూట్ ప్రయాణాలు



ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలతో గందరగోళంగా సత్యం జంక్షన్



సత్యం జంక్షన్‌లో ప్రమాదానికి గురైన కారు (ఫైల్)

సీతమ్మధార : నగరంలో జాతీయ రహదారిపై సత్యం జంక్షన్ డేంజర్ జంక్షన్‌గా మారిపోయింది. ఇక్కడ రాంగ్ రూట్ ప్రయాణాలతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జీవీఎంసీ 24వ వార్డు పరిధిలోని సత్యం జంక్షన్ నగరంలోనే అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాల్లో ఒకటి. జాతీయ రహదారి కావడంతో నిత్యం బస్సులు, ఆటోలు, కార్లు, వేలాది ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గంలో మద్దిలపాలెం, రామాటాకీస్, సీతమ్మధార, గురుద్వారా తదితర ప్రాంతాల నుంచి వచ్చేవారంతా సత్యం జంక్షన్ మీదుగానే రాకపోకలు సాగిస్తారు. అలాగే ఈ మార్గంలో 540, 541, 69, 211, 222వీ వంటి సిటీ బస్సులతోపాటు శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు వెళ్లే పల్లె వెలుగు బస్సులు కూడా రాకపోకలు సాగిస్తాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో తగుదునమ్మా అంటూ పలువురు వాహనచోద కులు రాంగ్‌రూట్‌లో రావడంతో ఎదురుగా వచ్చే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. రాంగ్ రూట్‌లో రావడమే తప్పు అనుకుంటే... కనీసం **సిగ్నల్స్** కూడా ఆన్ చేయకపోవడం తీవ్ర **ఆందో**ళనకరంగా మారింది. క్రాంతి **నగర్** నుంచి జాతీయ రహదారి మీదుగా రాంగ్‌రూట్‌లో ఉదయం నుంచి రాత్రి బాగా పొద్దు పోయే వరకు వాహనచోదకులు అధిక సంఖ్యలో రావడం గమనార్హం. సత్యం జంక్షన్ నుంచి ఫ్రీ లెఫ్ట్ **మార్గం**లో వెళ్లే వారికి రాంగ్‌రూ**ట్‌లో** వచ్చే వాహనచోదకులు స్పీడ్ **బ్రేకర్ల** మాదిరిగా పరిణమిస్తున్నారంటే **అతిశయోక్తి** కాదు.

మూడు స్టేషన్ల సిబ్బంది నిర్లక్ష్యంతో...

సత్యం జంక్షన్‌లో ద్వారకా ట్రాఫిక్ కానిస్టేబుల్ విధులు నిర్వహిస్తున్నా సరే ట్రాఫిక్‌ను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేమంటే జంక్షన్‌కి ఎడమ వైపు భాగం ఎంవీపీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధి కావడం వల్లనే ద్వారకా కానిస్టేబుల్ ఇటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని అంటున్నారు. అలాగే టెక్ మహీంద్రా ఉన్న ప్రాంతం త్రీటౌన్ స్టేషన్ పరిధిలో ఉంది. మూడు స్టేషన్ల పరిధిలో ఉన్నా సరే ఇక్కడ పటిష్టమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు మాత్రం కానరాకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు స్టేషన్ల సిబ్బంది తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నా రని వాహనచోదకలు ఆరోపిస్తున్నారు. విధులు నిర్వహించాల్సిన కానిస్టేబుల్ ఎప్పుడూ ట్రాఫిక్ ఐలాండ్‌కి మాత్రమే పరిమితమవ్వడం వల్లనే రాంగ్ రూట్‌లో ప్రయాణాలను అరికట్టే నాథుడు కరువయ్యాడని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడ రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎప్పుడే ప్రమాదం జరుగుతుందో...

సీతమ్మధార నుంచి రామాటాకీస్‌కు వెళ్లాడానికి... మద్దిలపాలెం నుంచి గురుద్వార్ మీదుగా భారీ వాహనాలు వెళ్లడానికి సత్యం జంక్షన్ ఎంతో కీలకం. ఇది నాలుగు వైపుల జంక్షన్ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రాత్రి పూట ఈ జంక్షన్‌లో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టకపోవడంతో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతున్నాయి. గతంలో సత్యం జంక్షన్‌లో కారు ప్రమాదం జరిగింది. అదృష్టవశాత్తూ కారులో ఉన్న వారంతా గాయాలతో బయటపడ్డారు. ఇటీవల స్కూటర్‌పై వస్తున్న ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయింది.

కొద్ది రోజుల కిందట ఆటోను భారీ వాహనం ఢీకొనడంతో అందులో ప్రయాణిస్తున్న ఓ యువకుడు మృతిచెందాడు. మిగిలిన వారు గాయాలపాలయ్యారు. ఇలా ఒక ప్రమాదాన్ని మరువక ముందే మరో ప్రమాదం జరగడంతో వాహనచోదకులు, స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. సత్యం జంక్షన్‌లో రాత్రి 9 గంటల తర్వాత ట్రాఫిక్ నియంత్రణకు ఓ కానిస్టేబుల్‌ను నియమించాలని పలువురు కోరుతున్నారు.



సత్యం జంక్షన్‌లో ఇష్టారాజ్యంగా ప్రయాణిస్తున్న వాహనదారులు

బాలికను అపహరించిన ఆటోడ్రైవర్‌పై పోక్సో కేసు

సీతమ్మధార : బాలికకు మాయమాటలు చెప్పి అపహరించిన ఆటోడ్రైవర్‌పై నాలుగో పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నగరంలోని దొండపర్తి సమీప వెంకటరాజునగర్‌లో నివసిస్తున్న బి.రాజేష్ కుమార్తె (17) అదృశ్యమైందని పోలీసులకు మంగళవారం ఫిర్యాదు అందింది. సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో ఎస్ఐ చిన్నంనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇన్‌స్టాగామ్ సాయంతో బాలిక గాజువాకలో ఆటోడ్రైవర్ రాజుతో ఉన్నట్టు నిర్ధారించుకుని అక్కడకు వెళ్లారు. వారిద్దరినీ అదుపులోకి తీసుకుని బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. నిందితుడు రాజుపై పోక్సో కేసు నమోదు చేసి గాజువాక పోలీసులకు అప్పగించారు.

కాంక్రీట్ వ్యర్థాల తరలింపు



తాటిచెట్లపాలెం వెళ్లే రహదారిలో మెటీరియల్ తరలిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డు పరిధి కంచరపాలెం నేతాజీ కూడలి నుంచి తాటిచెట్లపాలెం వీఐపీ రోడ్డుకు వెళ్లే మార్గంలో నిర్లక్ష్యంగా వదిలేసిన కాంక్రీట్ వ్యర్థాలు బుధవారం తొలగించారు. ఇక్కడి రహదారి పక్కన వ్యర్థాలు, కంకర వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రధాన రహదారికి ఇరువైపులా బ్లేక్ తారు (బీటీ) సామగ్రి, యంత్రాలు నిర్లక్ష్యంగా వదిలేయడంతో పరిసరాలు అధ్వానంగా మారడంతోపాటు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్యపై 'నిర్లక్ష్యంగా వదిలేశారు' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేసిన బీటీ మెటీరియల్‌ను జీవీఎంసీ జోన్ - 5 ఇంజినీరింగ్ ఈఈ తారా ప్రసన్నరెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది తరలించారు.

పథకాలపై అవగాహన అవసరం



ప్రశంసాపత్రాలు అందుకున్న మహిళలతో అతిథులు, అధికారులు

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు ఊర్వశి కూడలి పరిధి జై భారత్‌నగర్‌లో కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రతా పథకాలపై ధోత్‌పంత్ తెంగడి జాతీయ కార్మిక విద్యా - అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వార్డు కార్పొరేటర్ గంకల కవిత సదస్సు ప్రారంభించి మాట్లాడారు. స్వల్ప వ్యవధి శిక్షణతో ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈ - శ్రమ్ పోర్టల్‌లో చేరిన కార్మికులు ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల వరకు ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. కార్మిక విద్యాధికారి రెడ్డి నాగార్జున మాట్లాడుతూ కార్మికులందరూ విధిగా కేంద్ర ప్రభుత్వ సాంఘిక భద్రత పథకాల కోసం నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. శ్రమ యోగి మానధాన్ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనపై అవగాహన కల్పించారు. శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జి.అప్పారావు, ధరణి సోషల్ వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు హరి, హెచ్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల రక్షణకు ఉద్యమించాలి



ర్యాలీలో పాల్గొన్న మహిళా సంఘాల నాయకులు



నినాదాలు చేస్తున్న మహిళా సంఘాల ప్రతినిధులు

సీతంపేట : ఉద్యమాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న మహిళల హక్కులను కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా శ్రామిక దినోత్సవం సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) ఆధ్వర్యంలో బుధవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సదస్సు, ర్యాలీని ఉద్దేశించి ఆమె ప్రసంగించారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి ప్రతి మహిళా పోరాడాలని పిలుపునిచ్చారు. పురుషులతోపాటు మహిళలు అన్ని రంగాల్లో సమానమేనని, అన్ని రంగాల్లో ప్రతిభ చూపుతున్నారని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మనువాదాన్ని తీసుకొచ్చి మహిళల హక్కులను కాలరాయడానికి కుట్ర పన్నిందన్నారు. ఇకనైనా మహిళలంతా మేధావులు, అభ్యుదయ వాదులతో కలిసి హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు వివక్షకు గురవుతున్నారని, పురుషుల చెప్పుచేతల్లో మహిళలు ఉండేలా మనుధర్మం చేసిందన్నారు. మనుధర్మం తీసుకురావడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్ వంటి హిందూ ఫాసిస్టు సంస్థలు కుటిల పన్నాగాలు చేస్తున్నాయని విమర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని హిందుత్వ ప్రభుత్వం రద్దు చేయాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను విస్మరించి సమాజాన్ని ఫాసిస్ట్ దేశంగా చేయడానికి బీజేపీ కుట్ర పన్నిందన్నారు. పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.ఇందిర, జిల్లా ఉపాధ్యక్షురాలు బాలనాగమ్మ, భారత నాస్తిక సమాజం జిల్లా కార్యదర్శి వై.నూకరాజు, అమరవీరుల మృతుల కమిటీ ప్రతినిధి పద్మ, చైతన్య మహిళా సమాఖ్య ప్రతినిధి లలిత, మురికివాడల సంఘం నాయకులు రవి, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరిలో గాయనీ గాయకులు, అతిథులు

సీతంపేట : ఫ్రెండ్స్ రిథమ్స్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన హిందీ, తెలుగు చిత్ర గీతాల సంగీత విభావరి ప్రేక్షకులను అలరించింది. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్, కొణతాల రాజు, భయ్యా శ్రీనివాస్, ఫణిస్వామి జ్యోతి వెలిగించి సంగీత విభావరి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటువంటి సంగీత కార్యక్రమాల వల్ల మనసుకి స్వాంతన చేకూరుతుందని తెలిపారు. గాయనీ గాయకులు ఎం.ఎస్.మాధవ్, పీవీఎస్‌వీ ప్రసాద్, వి.ప్రభాకర్, సీహెచ్.వి.సత్యనారాయణ, సత్యశ్రీ, సి.వి.రాజేశ్వరి, పావని, భూమిక, అభినయ్ తదితరులు హిందీ, తెలుగు చిత్రాల్లోని హిట్ సాంగ్స్ ఆలపించి అలరించారు.

మార్షలింగ్ యార్డ్ పరిశీలన



మార్షలింగ్ యార్డ్‌లో మాట్లాడుతున్న డీఆర్‌ఎం లలిత్ బోరా

తాటిచెట్లపాలెం : వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోరా బుధవారం గూడ్స్ రవాణాకు ప్రాముఖ్యమైన మార్షలింగ్ యార్డ్ లో పర్యటించారు. మార్షలింగ్ యార్డ్‌కు అను బంధంగా గల రిసెప్షన్ యార్డ్, డిస్పాచ్ యార్డ్, ఓవర్ ఎక్స్‌చేంజ్ యార్డుల పనితీరును పరిశీలించారు. అనంతరం ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ కేబిన్ నిర్వహణ, ట్రాఫిక్ అంశాలు అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో ఆయనతోపాటు అధికారులు, సిబ్బంది ఉన్నారు.

మహిళా సాధికారతను నిలబెట్టుకోవాలి



ప్రభావతిని సత్కరిస్తున్న మహిళలు, ప్రముఖులు

మురళీనగర్ : మహిళలు తాము సాధించుకున్న సాధికారతను నిలబెట్టుకోవాలని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షురాలు ఎం.ప్రభావతి సూచించారు. మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కె.మాధవి అధ్యక్షతన మురళీనగర్‌లో బుధవారం సాయంత్రం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ప్రసంగించారు. ఈ సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ తరపున జాతీయ అథ్లెట్ దువ్వూరు సరోజినికి రూ.5 వేలు నగదు ప్రోత్సాహం అందించి సత్కరించారు. నడక, వంటల పోటీల విజేతలకు బహుమతులు అందించారు. జిల్లా - 101 కాన్ఫరెన్స్ చైర్మన్ కమల్ బైద్ 250 నార సంచులు పంపిణీ చేశారు. జిల్లా - 101 గవర్నర్ కె.ద్వారకానాథ్, ఆర్సీ - 5 యు.శుభ, ఎ.లక్ష్మీరెడ్డి, మహేష్, పి.కమల, ఎం.శేషామణి తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలని ధర్నా



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లు, మోటార్ కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలంటూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు బీసీహెచ్ మసేను మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాహనమిత్ర పథకం కింద రూ.15 వేలు ఇస్తామని, జీవో నంబర్ 21, 31 సవరిస్తామని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క హామీ కూడా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కే రెహమాన్ మాట్లాడుతూ పెరిగిన డీజిల్, పెట్రోల్, సీఎన్జీ గ్యాస్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ వంటివి ఆటోవాలాల నడ్డి విరుస్తుంటే ఉబర్, ఓలా, ర్యాపిడో వాహనాలకి ప్రభుత్వం అనుమతి ఇచ్చి ఆటో, మోటార్ కార్మికులకు ఆదాయం లేకుండా చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు, జిల్లా ప్రెసిడెంట్ ఎం.మన్మథరావు, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పడాల రమణ, ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ కాసుబాబు, పడాల గోవిందు, సీహెచ్ సాయికుమార్, రాంబాబు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

సీతమ్మధార : చెట్టుకి ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం కంచరపాలెం పరిధిలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి కంచరపాలెం ఎస్ఐ సమీర్ తెలిపిన వివరాల ప్రకారం... కంచరపాలెం గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన బత్తిన భాను ప్రకాష్ (20) ఇటీవల వ్యసనాలకు బానిసయ్యాడు. ఈ తరుణంలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో తన ఇంటి వెనుక ఉన్న చెట్టుకు భానుప్రకాష్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన బంధువులు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కాగా భానుప్రకాష్‌కు తండ్రి బత్తిన పైడిరాజు, తల్లి కొండమ్మ, సోదరుడు ఆనంద్ ఉన్నారు. వీరు కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఎస్ఐ సమీర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదని తెలిపారు.

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట : విశాఖ రత్న కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 31న ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ రత్న కళాపరిషత్ జాతీయ రత్న ఉగాది పురస్కారాలు అందజేయనున్నట్టు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.వి.భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవార్డుకు దరఖాస్తు చేసుకోదలచిన వారు వ్యక్తిగత వివరాలతోపాటు, రెండు కలర్ ఫొటోలు, ఆధార్ కార్డు పీడీఎఫ్ ద్వారా 98484 81767కు ఈ నెల 15లోగా వాట్సాప్ చేయాలని కోరారు.